క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



మృతురాలి బంధువులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రానికి చెందిన కొండా లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో చిలుకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె భర్త శ్రీనుతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.25 వేలు ఆర్థికసాయం అందజేసి చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు బెల్లకొండ భుజంగరావు, ఈగె శ్రీను, కనగాల శేఖర్, బైరు రాంబాబు, చేపూరి శ్రీను, కొండా వీరబాబు, మాదాసు రాజు, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవమూర్తుల దివ్య ప్రతిష్ఠాపనోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీ కంద ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీనమ్మాళ్వారుల, మనవాళ మహాముని ఉత్సవమూర్తుల దివ్య ప్రతిష్ఠ మహోత్సవాన్ని పూజారులు వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనమ్మాళ్వారుల విగ్రహాల దాత వేదాంతం కృష్ణమాచార్యులు, సుజాత, శ్రీమనవాళ మహామునుల విగ్రహాల దాత కందాళ గిరిధరాచార్యులు, కోమలి, పూజా కార్యక్రమ నిర్వహణకు రూ.10,116 అందజేసిన ములుగు భాస్కర ప్రసాద్, వీణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు, చైర్మన్, ధర్మకర్తలు, ఈఓ, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి తీసుకెళ్లాలి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న గోలి మధుసూదన్‌రెడ్డి, నాయకులు

గరిడేపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, విజయాలను ఇంటింటికి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, స్థానిక సంస్థల ఎన్నికల సూర్యాపేట జిల్లా ఇంచార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నరేంద్రమోదీ 11 సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధిపై ఆదివారం మండల కేంద్రంలోని 256, 257బూత్‌లలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పాలిశెట్టి అంజయ్య, ప్రభారి, శ్రీనివాస్‌గౌడ్, సోమయ్య, రాజు, ఆకుల భిక్షమయ్య, బాటసారి, ఆంజనేయులు, బాలకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచాలి

మునగాల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఆదివారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సరిపోక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిపట్ల కనికరం చూపించాలన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చలకూరి స్వరాజ్యం

మునగాల : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం డిమాండ్ చేశారు. ఆదివారం మునగాల మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సేవలను గుర్తించి శ్రమకు తగిన వేతనాన్ని పెంచాలన్నారు. జీఓ నంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షులు టి. ముత్తయ్య, ఎం.ముత్తయ్య, మండల కమిటీ సభ్యులు పరుశరాములు, ఎస్.నాగరాజు, జి.ప్రసాద్, రఘు, నరసయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఇందిర ఆశ్రమం.. అనాథలకు వరం

- 1998లో ఇందిర వృద్ధాశ్రమం ఏర్పాటు
- దాతల సహకారంతో నిర్వహణ
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు



ముకుందాపురం వద్ద నెలకొల్పిన ఇందిర అనాథ వృద్ధాశ్రమం



కోదాడలో అనాథ వృద్ధుడిని చేరదీస్తున్న ఇందిర ఆశ్రమం వ్యవస్థాపకురాలు విజయమ్మ (ఫైల్)

మునగాల : తన అనే వారు లేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తోంది ఇందిర అనాథ వృద్ధాశ్రమం. అభాగ్యులైన వృద్ధులను చేరదీస్తూ మానవత్వం చాటుకుంటోంది ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ. దాతల సహకారంతో ఆశ్రమాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూస్తున్నారు ఆమె.

1998లో ఏర్పాటు..

ముకుందాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నాగిరెడ్డి విజయమ్మ ×ఇందిర ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ×ని 1987లో స్థాపించింది. ఈ సొసైటీ ద్వారా విజయమ్మ మహిళలకు ఉచిత న్యాయ సలహాలు, ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చింది. సొసైటీలో భాగంగా 1998లో ఇందిర అనాథ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసింది. తొలుత గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పదిమంది వృద్ధులతో ప్రారంభించగా ప్రస్తుతం 35 మంది వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. 2000 సంవత్సరంలో ముకుంగాపురం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఎంతో విలువైన తన సొంతభూమిలో ఆశ్రమం కోసం గదులు నిర్మించి గత 24 ఏళ్లుగా వృద్ధులను పోషిస్తోంది. పదిహేను ఏళ్లుగా ఆశ్రమానికి దాతల సహకారం లభిస్తుండడంతో విజయమ్మ మరింత అభివృద్ధి చేసే పనికి ఉపక్రమించింది. ఇటీవల ఓ దాత తన తండ్రి జ్ఞాపకార్థం సుమారు రూ.7లక్షల వ్యయంతో మూడు గదులు కూడా నిర్మించారు.

వృద్ధులకు ఆధార్‌కార్డులు ఇవ్వాలి

వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పలువురు అనాథ వృద్ధులకు ఆధార్ కార్డులు లేవు. అధికారులు వారికి ఆధార్‌కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి. వృద్ధాశ్రమానికి ప్రతినెల వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండడంతో నిర్వహణ భారంగా ఉందని నిర్వాహకురాలు చెబుతున్నారు. ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ నుంచి రేషన్ బియ్యం మంజూరు చేస్తే కొంత మేర ఉపశమనం కలుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం ఆశ్రమానికి విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో లేదనిఅధికారులు విద్యుత్ సరఫరా అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి కేటాయించాలి



26 ఏళ్ల నుంచి ఎన్నో అవాంతరాలు, ఇబ్బందులు ఎదురైనా ఆశ్రమం నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం దాతలు సహకారం అందుస్తుండడంతో కొంతమేర ఉపశమనం కలుగుతోంది. ఆశ్రమం పక్కన ప్రభుత్వ భూమి నిరుపయోగంగా ఉంది. సదరు భూమిని ఆశ్రమానికి కేటాయిస్తే ఆశ్రమాన్ని మరింత విస్తరించి ఎక్కువమంది అనాథవృద్ధులకు ఆశ్రయం కల్పిస్తాను.

– నాగిరెడ్డి విజయమ్మ, ఆశ్రమ వ్యవస్థాపకురాలు

ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు అందుతున్నాయి



నాది మిర్యాలగూడెం పట్టణం. నాకు అందరు ఉన్నప్పటికీ అనాథగా జీవించాల్సి వచ్చింది. రోజురోజుకు నా ఆరోగ్యం క్షీణించే పరిస్థితి నెలకొనడంతో ఆశ్రమం గురించి తెలుసుకున్నాను. నాలుగు ఏళ్ల క్రితం ఇందిర వృద్ధాశ్రమంలో చేరాను. నాటి నుంచి నాకు ఈ ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు అందుతుండడంతో ఇక్కడే స్థిరపడిపోయాను.

– కొడకండ్ల పుష్పమ్మ, మిర్యాలగూడ

20 ఏళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నా



నేను ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గత 20 ఏళ్లుగా ఆశ్రయం పొంతున్నాను. మాది మునగాల మండలం నర్సింహులగూడెం. మానసిక స్థితి సరిగా లేక ఆనాడు వీధుల వెంట తిరుగుతుంటే ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ చేరదీసి ఆశ్రమానికి తీసుకువచ్చింది. నాటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. నాకు నా అనేవారు లేరు.

– ఎల్లమ్మ, మానసిక దివ్యాంగురాలు, నరసింహులగూడెం

వృద్ధాశ్రమం.. దేవాలయంలా ఉంది



నా అనుకున్న వారు నన్ను ఆదరించకపోవడంతో రెండేళ్ల క్రితం ఆశ్రమంలో వచ్చి చేరాను. ఆశ్రమం నాకు దేవాలయంలా ఉంది. అప్పుడప్పుడు నా అనేవారు గుర్తుకు వచ్చినప్పుడు బాధగా ఉటుంది. అప్పుడప్పుడు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఆశ్రమంలో నాకు ఆనందంగా ఉంది.

– నరుట్ల సీతరామయ్య, వజినేపల్లి, చింతలపాలెం మండలం

ఆనందోత్సాహాలతో స్నేహితుల దినోత్సవం



చిలుకూరులో ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నేరేడుచర్లలో వాకింగ్ గ్రూప్, ఇంపాక్ట్ క్లబ్ సభ్యులు వేర్వేరుగా కేక్ కట్ చేశారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వాకింగ్ గ్రూప్ సభ్యులు రాగిరెడ్డి గోపాల్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్‌రావు, సుంకర క్రాంతికుమార్, నిమ్మగడ్డ సుబ్బారావు, సుధాకర్, వెంకటరమణారెడ్డి, కృపాకర్, జంగారావు, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సైదయ్య, ముచ్చర్ల గోపాలకృష్ణ, పూర్ణచంద్రారెడ్డి, ఇంపాక్ట్ ట్రైనర్ వీరవెల్లి శ్రీలత, సంతోషి, ధనలక్ష్మి, మహాలక్ష్మి, అనూష, అనురాధ, పుష్పలత, లక్ష్మి, గోపిక, స్వాతి, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

చిలుకూరు : మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని చిన్నారులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు.



నేరేడుచర్లలో ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న స్నేహితులు



గరిడేపల్లి : సర్వారంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మత్తుకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుడి ప్రచారం



మాదక ద్రవ్యాల నిర్మూలనపై వినూత్నంగా ప్రచారం చేస్తున్న రాచకొండ ప్రభాకర్

చిలుకూరు : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. ఈమేరకు ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి మంచి చేయాలనే తపనతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తనకు సెలవులు ఉన్న రోజుల్లో కరపత్రాలు పంచిపెడుతూ.. మద్యం, డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు అనే ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ మైక్‌తో ఊరూరా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కొండా రామాంజనేయులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : పద్మశాలి సంఘం హుజూర్‌నగర్ పట్టణ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి సంఘం సభ్యులు పూలమాల వేసి జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. నూతన అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, ప్రధాన కార్యదర్శి గంజి శివ, కోశాధికారి నామని చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, జి.శీను, కె.ప్రసాద్, కె.సైదులు, ఎస్.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, ప్రచార కార్యదర్శులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని పట్టణ ప్రముఖులు, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు టి.మల్లికార్జునరావు, డి.శ్రీనివాస్‌గౌడ్, పి.కోటేశ్వరరావు, వీరమల్లు, అజీజ్ పాషా, సుబ్బరాజు, మల్లయ్య, సత్యనారాయణ, మట్టయ్య, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు



నేరేడుచర్ల : రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కొణతం చిన వెంకట్‌రెడ్డి



మఠంపల్లి : చౌటపల్లిలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న రామిరెడ్డి తదితరులు

నేరేడుచర్ల : రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్‌తో కలిసి ఆయన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలక సరితసైదిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు భాషా, నాగయ్య, మత్స్య సొసైటీ చైర్మన్ వీరయ్య, నక్క రమాదేవి, ఆకారపు వెంకటేశ్వర్లు, సైదులు, జంగిలి వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, రాంరెడ్డి, మల్యాద్రి, కోటి తదితరులు ఉన్నారు.

చౌటపల్లిలో..

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రేషన్‌కార్డులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ కొండేటి రామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మోడె లింగయ్యయాదవ్, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాల పండుగ



కోదాడరూరల్ : కోదాడలోని ముత్యాలమ్మ ఆలయంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కోదాడరూరల్ : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ముత్యాలమ్మ పండుగను ఆదివారం కోదాడ పట్టణంలో వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు తలపై ఎత్తుకొని ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులు, ముత్యాలమ్మ, రైతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పాలపొంగళ్లు, బోనాలు సమర్పించారు. అనంతరం పోతరాజు వద్ద యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నాయిపాలెంలో..

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా మహిళలు బోనాలు తలపై ఎత్తుకొని ఊరేగింపుగా ముత్యాలమ్మ గుడికి చేరుకొని ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. గిరిజనులు కోళ్లు, మేకలు బలిచ్చి పోతరాజుకి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ జెడ్పీటీసీ భూక్యా నీలానాయక్, మాజీ సర్పంచ్‌లు భూక్యా నాగునాయక్, భరత్‌నాయక్, నాయకులు రవీందర్‌నాయక్, గోవర్ధన్‌నాయక్, మాంగునాయక్, రాహుల్‌నాయక్, లచ్చీరామ్‌నాయక్, హనుమాన్ సింగ్, మహిళలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో గల మాలపెల్లి కాలనీలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జలబిందెలు, బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు పూజలు జరిపారు. కార్యక్రమంలో నార్ల శాండిల్య శర్మ, విగ్రహ దాతలు గోపిరెడ్డి పుల్లారెడ్డి, మంగమ్మ దంపతులు, రేల చిన్న వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోదాడరూరల్ : అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



మేళ్లచెరువులో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



మేళ్లచెరువు : విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



మఠంపల్లి : చెన్నాయిపాలెంలో బోనాలతో ముత్యాలమ్మ ఆలయానికి వెళ్తున్న గిరిజనులు

సాగు పనుల్లో రైతన్న బిజీబిజీ



చిలుకూరులో వరి నారు తీస్తున్న కూలీలు

చిలుకూరు : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమకాలువకు సాగు నీరు విడుదల అవుతుండడంతో చిలుకూరు మండలంలో రైతులు సాగు పనుల్లో బిజీబిజీ అయ్యారు. చెరువులు, బావులు, బోర్ల కింద వరి సాగు చేపడుతున్నారు. 20 రోజుల క్రితం నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. కొందరు రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశారు. చిలుకూరు మండలంలో సుమారుగా 17 వేల హెకార్టుల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం, చిలుకూరు, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం తదితర గ్రామాల్లో సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

రాజకీయ రణభేరి సభకు తరలివెళ్లిన ఆర్యవైశ్యులు



నేరేడుచర్ల : రాజకీయ రణభేరి సభకు తరలివెళ్తున్న ఆర్యవైశ్యులు

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభకు నేరేడుచర్ల నుంచి ఆర్యవైశ్యులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్‌రావు, జిల్లా నాయకులు పాల్వాయి కృష్ణమూర్తి, అశోక్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, సుధాకర్, అశోక్, రాము, రామారావు, జగదీష్, కిషన్, రవి, సురేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వెంకన్న, అనిల్ తదితరులు ఉన్నారు.

మోతె నుంచి..

మోతె : హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల రాజకీయ రణభేరి సభకు ఆర్యవైశ్య మోతె మండల కమిటీ సభ్యులు తరలివెళ్లారు. వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు నిర్వర్తిస్తూనే భగవంతుని అనుగ్రహం పొందాలి



అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ తమ బాధ్యతలు నిర్వర్తిస్తూనే భగవంతుని అనుగ్రహం పొందాలని ఇస్కాన్ మందిరం ప్రవచనకర్త, భగవద్గీత ప్రచారకులు ప్రభుజి హృషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత మూడవ అధ్యాయంపై ప్రసంగించారు. పట్టణంలో శ్రీ కృష్ణుడి దేవాలయం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం ఏ ర్పాటు చేసిన అన్నదానాన్ని సీఐ చరమందరాజు ప్రా రంభించారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

● పంట కాదు.. వాగు



పంట ఎంతో బాగుందని అనుకుంటున్నారా.. అలా అనుకుంటే మీరు పప్పులో కాలు వేసినట్లే. అది పంట కాదు వాగు. హుజూర్‌నగర్ మండలం గోపాలపురం సమీపంలో పొలాల మధ్య నుంచి వెళ్తున్న వేములూరు వాగు. వాగులో గుర్రపుడెక్క పెనవేసుకొని నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. – సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

స్వాతంత్ర్య సమరయోధుడి దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



వాసికర్ల సత్యనారాయణ, వెంకటమ్మ దంపతుల విగ్రహాల వద్ద కుటుంబసభ్యులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు వాసికర్ల సత్యనారాయణ, వెంకటమ్మ దంపతుల విగ్రహాలను గ్రామ పరిధిలోని వారి సమీకృత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన కుమారులు శేషుకుమార్, కమల ప్రసాద్, లక్ష్మీప్రియ, నీలిమ, విజయలక్ష్మి, రేణుక, మాధవి, పద్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపారు. గరుడ వాహనంపై స్వామి వారిని ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.